# దేవుడు నవ్వుతూనే వున్నాడు!



పోలంప్రగడ రాజ్యలక్ష్మి

**నిత్యమూ** నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా విలసిల్లే ఆ తిరుమలేశుని సన్నిధిలో, బీదా సాదా అనే భేదం లేకుండా అంతా ఒకే వరసలో నిలబడ్డ ప్రజావాహిని, నెమ్మది నెమ్మదిగా ముందుకు కదులుతోంది. స్వామి దర్శనంకోసం వేలాదిగా ఉన్న జన ప్రవాహంలో లక్షలాది మొక్కులూ, కోట్లాది కోరికలూను, ప్రతి వారి మనస్సులోనూ ఏదో ఒక విన్నపం ఏదో ఒక వేడికోలు.

చేసిన పాపాల్ని క్షాళితం చెయ్యమని కొందరు. వచ్చిన లాభాల్లో

నీవాటా నీకుచెల్లిస్తున్నాం కనక మా వాటాకేం లోటురానియ్య వద్దని మరికొందరు. ఆరోగ్యాన్ని ప్రసాదించమని కొందరు ప్రార్థిస్తుంటే, ఉన్న ఆనందాన్ని మరికొంత ఎక్కువ చెయ్యమని కొందరు వేడుకుంటు న్నారు. కొందరి కళ్ళల్లో కన్నీళ్ళ కడవలూ కొందరికళ్ళల్లో కాంతి కిరణాలూ. ఇలా ఎందరు ఎన్నిరకాలుగా తనని చేరవస్తూన్నా అందరి మీదా ఒకేరకమైన చిరునవ్వుల్ని చిలకిస్తూ చిదానంద స్వరూపుడుగా ఆ దేవదేవుడు నిలబడి ఉన్నాడు. కదులుతూన్న భక్తుల్ని కడకంటయినా చూస్తున్నాడో లేదో, వాళ్ళు చేస్తూన్న విన్నపాల్ని చెవిని పెడుతున్నాడో లేదో – ఏమో – మందహాసాల్ని మాత్రం చిందిస్తున్నాడు.

ఆ మందహాసాన్ని చూసి మొహం చిట్లించుకొంది సరోజిని. కోపం కూడా తెచ్చుకొంది. "నాకు మనస్సో ఇష్టంలేని పెళ్ళిని నీ సన్నిధానంలో జరిపిస్తూ పైగా ఈ చిరునవ్వులు కూడా ఎందుకు ? కరుణామయుడట – కరుణామయుడు !"– కన్నె జీవితంలో కనిన కలలన్నీ ఇంకో గంటలో కరిగిపోతూన్న ఆవేదనామయ. సమయంలో, ఇంకేం నివేదన చేసుకొనునో ఏమో–ఇంతలో దేవస్థానం జవాను 'కదలండి–ముందుకు కదలండి.... ఊ.... జరగండి' అంటూ సరోజినిని అందరితోపాటు, ఆ తిరుమలేశుని సన్నిధినుంచి బయటికి పంపించాడు.

గుడిదాటి ఇవతలకివచ్చినా, ఆ శ్రీనివాసుని చిరునవ్వు సరోజినిని మనస్సులో వెంబడిస్తూనే ఉంది.

పట్టుచీర కట్టుకొని, కళ్ళకి కాటుకా పాదాలకి పారాణి పెట్టుకొని, నుదుటను కళ్యాణంబొట్టూ, ఎడంబుగ్గని నల్లనిచుక్కా, చేతిలో తాంబూలం కొబ్బరిపండుతో గౌరీ పూజదగ్గర కూర్చున్న సరోజినికి గతంఅంతా దృశ్యాలుగా జ్ఞాపకం రాసాగింది.

సరిగ్గా ఏడాది క్రితం– అమ్మపోయిందని తెలిసి బొంబాయి నుంచి వచ్చారు అత్తయ్యా మావయ్యా సుందరీను. సుందరీ తనూ ఒకేఈడు వాళ్ళు కావడంవల్ల ఏవేవో కబుర్లతో ఇట్టే కాలక్షేపం అయిపోయింది వాళ్ళున్న వారం పదిరోజులూ. బొంబాయిపట్నం విశేషాలూ, తన కాలేజీతమాషాలూసుందరి చెప్తూంటే తనకళ్ళు ఆసక్తిగా ఆశ్చర్యంతో మెరిసేవి. తనూ సుందరిలాగ బొంబాయిలోఉండి కాలేజీలో చదివితే ఎంత బాగుండును!' అనిపించేది.

'పోనీ మాతో బొంబాయి వస్తావేమిటి? నెలో రెణ్ణెల్లో ఉండివద్దువుగాని' అని మావయ్య అన్నవుడు తన హృదయం ఎంత ఉప్పొంగిపోయిం

దని!' పోనీ వెళ్ళిరా!' అని దగ్గరగా తీసుకుని అన్నయ్య తల నిమిరినప్పుడూ, 'వెళ్ళు- అక్కడ నీకు ఇంతలో తాళికట్టేసే బావలెవరూ లేరులే' అని వదిన పరిహాసం చేసినప్పుడూ తన ఆనందానికి ఇంక అవధులే లేకపోయాయి.

ఆ రోజున అలా బొంబాయి వెళ్లకపోయినా బాగుండిపోను. కాని వెళ్ళింది. గాలిలో తేలిపోతూ, ప్రయాణం పొడుగునా కన్పించిన అందమైన సుందరదృశ్యాల నన్నింటినీ కళ్లతో త్రాగుతూ మరీవెళ్లింది. బొంబాయి చూడగానే తను మరో లోకంలోకి వెళ్ళినట్లు అనిపించింది. ఎత్తయిన భవనాల్నీ విశాలమైన రోడ్లనీ కళ్ళు చెదిరిపోయే లాంటి షాపుల్నీ చూపిస్తూ తీసుకు వెళ్ళిన చోటుకి తీసుకు వెళ్ళకుండా రోజూ సుందరి తనని సాయంత్రంమూడు గంటలనుండి రాత్రి ఎనిమిదింటిదాకా ఆవట్నంలో తిప్పుతూ ఉంటే, తనకి రోజులూ వారాలూ నిముషాల్లా గడిచిపోసాగాయి. రోజూ ఏదో ఒక సరదా. ఏదో ఒక అనుభూతి. హిందీ మరాటీ ఇంగ్లీషు భాషల్లో అనర్గళంగా సుందరిమాట్లాడేస్తూంటే తను కొత్తలో ఆశ్చర్యంగాచూస్తూఉండేది. రోజులు గడిచినకొద్దీ తనకీకొన్ని హిందీమాటలూ అవీ వచ్చాయి. ఎవరేనా మరాఠీతోనూ హిందీతోనూ మాట్లాడుతూంటే అర్థం కాసాగింది. అయితే సుందరిలాగ తను చలాకీగా ఉండడం సాధ్యం కావడంలేదు, చురుకుగా ఉండాలని సరదాయే- కానిఏమిటో తగనిసిగ్గు!

ఆ రోజుతనూ సుందరీ ఆ రెండ తస్థుల పెద్దబట్టల దుకాణానికి వెళ్ళడంవల్ల పరిస్థితి ఇంతవరకూ వస్తుందని తనూ అనుకోలేదు. సుందరీ అనుకొనిఉండదు. తనకి నచ్చిన ఆ కొత్త వెరైటీ గ్రీన్ సిల్కు శారీ ఖరీదు డెభ్భైయిరూపాయలని కొట్టువాడు చెప్పినప్పుడు, తనపర్సులో ఏభై రూపాయలే ఉన్నప్పుడు, తను నిరాశతో ఎంతబాధ పడిపోయిందో. ఇంటికివెళ్ళి అత్తయ్యనోమావయ్యనో అడిగితే తక్కువ ఇరవై ఇస్తారు.... కాని.... కాని.... ఇదీ అని చెప్పలేని మొహమాటం- తనమనస్సులోఉన్న భావాన్ని కనిపెట్టిందో ఏమో, నవ్వుతూ అంది సుందరి 'ఆ చీర నీకంత మనసైతే కొనుక్కోవచ్చు. కాని అమ్మని గాని నాన్నని గాని డబ్బు అడక్కుండా కొనుక్కోవాలంటే ఎలా? షాపువాడేమో డభ్భై రూపాయలకి తగ్గించేది లేదంటున్నాడు. ఇంక ఈ పరిస్థితిలో ఒకే ఒక మార్గంఉంది'-

మర్నాడు ఉదయంతొమ్మిదింటికే తనని ఇంట్లోంచి బయలుదేరదీసి,

దారిలో ఆ మార్గంపేదో సుందరి ఉప దేశించేసరికి తన గుండె గతుక్కు మంది. 'అమ్మో- అత్తయ్యకీ మావయ్యకీ తెలిస్తే?' అంది. 'ఈ మహా పట్నంలో వాళ్ళకెలా తెలుస్తుంది? అయినా నువ్వేం తప్పుపని చేస్తున్నావని భయపడ్డానికి? తమాషాగా ఈ అయిదారు గంటలూ ఆ చీరకట్టుకుని షాపులో నిలబడివచ్చిన కస్టమర్స్‌కి ఆ న్యూవెరైటీ చీరగురించి చెప్పి దాన్ని పాప్యులర్ చేస్తావు. ఇలా సేల్స్‌కమ్ షోగర్ల్‌గా ఇవాళా రేపూ శ్రమపడ్డావంటే ఆ కొట్టు యజమాని నీకు ఇరవై రూపాయలిస్తాడు. దానికి నీ ఏభయ్యీ జత చేసి ఆ చీరని నీ స్వంతం చేసుకో వచ్చు- ఇలా ఇక్కడ చాలామంది చేస్తూంటారు. తప్పులేదు. ఆలోచించుకో' అని సుందరి హెచ్చరించినా తనకి జంకూ భయం ఓ మూలని ఉండనేఉంది. కానయితే ఆ చీర మీద ఉన్న మోజు ఎంతో ఎక్కువగా ఉండడంవల్ల తను 'సరే' అనవలసి వచ్చింది ఆఖరికి.

తిరిగి కాలేజీనుంచి మూడు నాలుగు ప్రాంతంలో వస్తానని చెప్పి సుందరి వెళ్ళిపోయిం తర్వాత తను భయపడుతూ భయపడుతూ షాపులోకి వెళ్ళింది. యజమాని ఇచ్చిన మోడల్ చీరని పక్క గదిలోకి వెళ్ళి జంకుతూ జంకుతూనే కట్టుకుంది. ఆ రోజు షాపుకి వచ్చింనవాళ్లందరికి హిందీలోనూ మరాఠీలోనూ తడబడుతూనే ఆ చీర గురించీ, ఇతర వెరైటీలకంటే దానికున్న ప్రత్యేకత గురించీ చెప్పి కొందరిచేత ఆ చీర కొనిపించింది.

'హమ్మయ్య ఇవాల్టికి ఈ గండం గడిచింది. సుందరివస్తే ఇంక ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఇంక రేపు ఒక్క రోజు శ్రమపడితే ఈ చీర తన స్వంతం అవుతుంది' అని అనుకుంటూండగా షాపు ముందు ఒక స్కూటర్ ఆగింది. పచ్చని ఎత్తయిన ఒక యువకుడు స్కూటర్ దిగి కర్చీఫ్‌తో మొహం తుడుచుకొని, సరాసరి తనదగ్గరికే వచ్చి 'మేడమ్' అన్నాడు. తనకా పిలుపు వినగానే ఒళ్ళంతా అదోలా ఝల్లుమంది. తలెత్తి ఓరగా అతనికేసి చూస్తే సరిగ్గా అదే సమయంలో అతనూ తనకేసి చూశాడు. తనకి ఎంత సిగ్గేసిందని!

'మేడమ్ మీ పేరు? సారీ - మీరు కట్టుకున్న శారీ పేరు?' అన్నాడు హిందీలో. తనకి కోపమూ వచ్చింది నవ్వూ వచ్చింది. ఆ చీరకి సంబధించిన వివరాలన్నీ చెప్పింది. తను కట్టుకున్న శారీరంగు బాగుందనీ అలాటి రంగుదే కావాలనీ చెప్పి, మర్నాడు వచ్చి తీసుకుంటాను అంటూ స్కూటర్ ఎక్క

వెళ్ళిపోయాడు. ఆ రోజల్లా చురుకుగా ఆకర్షణీయంగావున్న ఆ యువకుడే అనుక్షణం తన ఆలోచనల్లో రాసాగాడు. ఎప్పుడూ లేంది అతనితో మాట్లాడుతున్నప్పుడు ఆ గగుర్పాటేమిటి తనకి? మర్నాడు వస్తానన్నాడు. నిజంగా వస్తాడా? వచ్చి చీర కొనుక్కుని పట్టిగెళ్తానన్నాడు .... ఎవరికి పట్టిగెళ్తాడు? పెళ్ళి కాలేదుకదా? అదిరిపడింది తను.

'పెళ్ళయితే, మరో ఆడపిల్ల కళ్ళల్లోకి అంతసూటిగా మగాడు చూడలేడే - అదేదో రేపు తేల్చుకుందువుగాని ఈ రాత్రికి పడుకోవే బాబూ' అని రహస్యంగా సుందరి కసురుకోవడంతో తను పడుకోక తప్పలేదు.

మర్నాడు మళ్ళీ మామూలుగా అత్తయ్యకీ మావయ్యకీ 'ఊరు చూస్తాను' అని చెప్పి సుందరితో కలిసి బయలుదేరింది తను. సుందరి తనని బట్టలషాపు దగ్గర దిగవిడిచి 'ఇదిగో నేను మూడున్నర అయ్యేటప్పటికి వచ్చేస్తాను- ఈలోగా షాపులో సేల్స్‌గరల్ పని పూర్తి చేసుకుంటావో, అతనీ రెండురోజులకీ ఇచ్చే ఇరవై రూపాయలూ కలుపుకుని నీకుమనసైనశారీతీసుకునిరెడీగా ఉంటావో లేదా నిన్నటి నవమన్మథుడితో కబుర్లు చెబుతూ ఉంటావో- ఏమో నీ ఇష్టం - నేను రాగానే మాత్రం ఇద్దరం కలిసి ఇంటికి వెళ్ళిపోవాలి. ఆలశ్యం చెయ్యడానికి వీలు లేదు. ఆc!' అంటూ హెచ్చరించి మరీ వెళ్ళిపోయింది.

గంటలు గడుస్తున్నాయి. షాపులోకి వచ్చిన వాళ్ళందరికీ సమాధానాలు చెప్పలేక తనకి చిరాకేస్తూంది. ఇంకో అరగంటలో తనకి డ్యూటీ అయిపోతోంది. కొట్టు యజమానికి ఏభైరూపాయలు ఇయ్యడంతో ఆ అందమైన చీర తనది అవుతుంది, ఈలోగా సుందరికూడా వచ్చేస్తుంది ఎలాగ? ఇంకా ఆయన రాలేదు. రారేమో! తన గుండె గతుక్కుమంది.

ఆ సమయంలో బయట స్కూటర్ ఆగిన చప్పుడైంది. తను అటు చూసింది. అవును. ఆయనే! తన కళ్ళు ఆనందంతో కంగారుగా రెండు మూడుసార్లు టపటప లాడుతూ మూసుకుని తెరుచుకున్నాయి. వచ్చే చిరునవ్వుని పెదిమలమీదే నిలిపి వేస్తూ 'నిన్న చూపించిన శారీ ఏదండీ' అన్నారాయన హిందీలో. వణుకుతూన్న చేతుల్తో చీర అతనికి అందిస్తూంటే అతని వేళ్ళు తనకి తగిలాయి. అతను 'సారీ' అన్నాడతను ఇంగ్లీషులో. తను చటుక్కున ఫరవాలేదు లెండి' అనేసింది, తెలుగులో.

అతను ఆశ్చర్యంతో అమట్టునే ఉండిపోయి 'ఏమిటి మీరు తెలుగు వారా?' అన్నాడు స్వచ్ఛమైన తెలుగులో. కాస్సేపాగి నాపేరు జగదీష్– మీపేరు?' అన్నాడు. తనపేరు అతనికి చెబుతూవుండగా, గాలిదుమారంలా వచ్చింది సుందరి 'ఏం డ్యూటీ అయిపోయిందా, వెళ్ళిపోదాం. టైమయింది' అంటూ.

శారీ తీసుకుని అతను స్కూటర్ దగ్గరికి నడిచాడు– యజమానికి ఏభై రూపాయలు చెల్లించి, తనుకూడా తను కట్టుకున్నచీర తనది అనిపించుకొని సుందరితో ఇవతలకి వచ్చింది. అప్పటిదాకా అతను బయట స్కూటర్ దగ్గరే నిలబడివున్నాడు. తననిచూసి చిరునవ్వు నవ్వాడు. 'వీరు....' అంటూ అతనిని సుందరికి పరిచయం చెయ్యబోతే 'అ .... నాకు అంతా అర్థమైంది' అంది సుందరి. అని, అతనికేసి తిరిగి 'మీరు ఎక్కడికి వెళ్ళాలి?' అంది.

'రిజరుబేంక్ వరకు'

'ఏమిటి? ఈయన రిజర్వుబేంక్‌లో పని చేస్తున్నారా' అనుకొం దితను.

'రిజర్వు బేంక్ వైపా? అయితే మేమూ అటే. కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళొచ్చు' అంది సుందరి– దార్లో సుందరి చలాకీగా ఏవో కబుర్లు చెబుతూంటే సమాధానాలిస్తూస్కూటర్ నడిపించుకుంటూ తనకేసి మధ్య మధ్య దొంగచూపులు విసరసాగాడు జగదీష్.

మధ్యలో ఎవరో'హాలోసుందరీ!' అంటూపిలిస్తె సుందరి అటువెళ్ళింది. ఆ అవకాశం తీసుకొని జగదీష్ 'ఇక్కడ ఎవరేనా బంధువులఇంటికి వచ్చారా?' అని అడిగిగాడు తనని.

'మీకెలా తెలుసు?'

'మొదట్నుంచీ ఇక్కడే ఉంటూన్న అమ్మాయి అయితే మీలాగ ఉండరు. అదిగో – మీ సుందరిలా ఉంటారు.'

తనకి నవ్వు వచ్చింది.


'మళ్ళీ మిమ్మల్ని ఎక్కడకలుసుకోవచ్చు?'

'ఈచౌరాస్తాలోనే–అదిగోఆషాపు దగ్గర ఇదే సమయంలో' అంటూ అతని ప్రశ్నకి సమాధానం చెప్పింది అప్పుడే దగ్గరికి వచ్చిన సుందరి.

'రైటో!' అంటూ అతను స్కూటర్ మీద వెళ్ళిపోయాడు.

చురుకు–అందం–ఆకర్షణ– రిజర్వుబేంక్‌లో ఉద్యోగం–స్కూటర్ మీద తిరగడం–దర్జా జీవితం–ఓహో!

'ఏవిటే అతను వెళ్ళిపోయి ఐదు నిముషాలైనా ఇంకా అటే చూస్తున్నావు? భయం లేదులే. రేపు అతను తప్పకుండా ఇక్కడ వచ్చివాలతాడు. నీలాటి బంగారపు బొమ్మని వదులుకొనేటంతటి అమాయకుడు కాదులే, మొహం చూస్తేనే తెలుస్తోంది'




అంటూ సుందరి తనని సిటీబస్‌వేపు నడిపించింది బలవంతంగా.

'చీరకి డబ్బుసరిపడాలేదన్నావు? ఆ డబ్బుకే ఎలా ఇచ్చాడు షాపువాడు?' అంటూ, పర్నాడు తను ఆచీర ముచ్చటపడి కట్టుకొనిముస్తాబై సుంతరితో కలిసి జగదీష్‌ని కలుసుకోడానికి వెళ్లబోతూంటే, అత్తయ్య నిలదీసి అడిగింది.

ఏం సమాధానం చెప్పాలో తెలియక తను బిత్తరపోయింది. చట్టున సుందరి అడ్డుకొని 'మొదట ఇవ్వనన్నాడే- తర్వాత కొంచెం డేమేజీ కనిపించింది. పదిరూపాయలుతగ్గింది. తర్వాత మరో చిన్నపోగు పోయింది అన్నాం. దాంతో ఇరవై రూపాయలు తగ్గించాడు. కదుటే సరోజినీ?' అంటూ ఓ అబద్ధాన్ని చక్రంలా అడ్డేసింది.

అత్తయ్యసుందరిమీద రెండాకులు ఎక్కువే నేర్చింది. అందుకే 'ఏవీ ఆ డేమేజీలు చూడనీ!' అంది. తన గుండె ఆగింది.

కాని సుందరి అత్తయ్యకి కూతురేగా? అలా అడుగుతుందని ముందే ఊహించిందట. అందుకే చీర తేగానే క్రితం రాత్రే, అత్తయ్య నడుం వాల్చాక రహస్యంగా ఇంట్లో మెషీన్‌మీద రెండు చిన్న పేచ్‌లు వేసిందట. అవి చూపించి అత్తయ్యని నమ్మించింది.

బ్రతుకుజీవుడా! అని సాయంత్రం షెరువంకని సుందరితో కలిసి తను బైటపడింది. అనుకొన్న చోటుకి వెళ్ళేసరికి అప్పటికే జగదీష్ వచ్చి వేచివున్నాడు. అతడ్ని చూడ్డంతోటే తన మనస్సు ఉత్సాహంతో ఉరకలు వేసింది.

'అయ్యో జగదీష్‌గారూ! మీరూ మా సరోజనీ కలిసి ఏవేం కబుర్లు చెప్పుకొని ఎక్కడెక్కడికి వెళ్ళినా ఏడయ్యేసరికి ఇక్కడుండాలి. ఎట్టి పరిస్థితిలోనూ ఎనిమిది దాటకుండా ఇంటికి రాకపోతే మా అమ్మ కర్ర పుచ్చుకుంటుంది. మరినేను వస్తాను' అంది సుందరి.

'నువ్వెక్కడికే, నన్ను ఒకత్తెనూ వదిలేసి?' అంది తను భయంగా.

'ఒక్కత్తెవూ ఏమిటి ఆయన ఉన్నారుగా? నేను అర్జంటుగా ఒక ఫ్రెండుని కలుసుకోవాలి. వస్తా.... టా....టా .... ఛీర్‌యూ' అంటూ కేకేస్తున్నా వినిపించుకోకుండా వెళ్లి పోయింది సుందరి.

'అదేవిటండీ అలా భయపడు తున్నాడు? మిమ్మల్నేం కొరుక్కు తినెయ్యనులెండి' అన్నాడు జగదీష్.

తనకి కోపంతోపాటు నవ్వుకూడా వచ్చింది. మాట మార్చడంకోసం 'అవునూ? .... మీ స్కూటరేదీ?' అంది.

పకపక నవ్వి 'భలే వారే - ఆ స్కూటర్ నాది కాదు. ఒక ఫ్రెండుది' అన్నాడు జగదీష్.

'ఒకమాట అడగనా?'

'ఒకటికాదు పది అడగండి అలా బీచ్‌లోకి వెళ్ళి కూచున్నాక'-

అతని పక్కని, తనకి ఇష్టమైన ఆ చీరలో, ముచ్చటగా నడుస్తూంటే స్వర్గలోకాల్లోకి తేలిపోతున్నట్లు అని పించింది. చీర మాసిపోకుండా జాగ్ర త్తగా సర్దుకుని ఇసుకలో కూర్చుం టూండగా,

'ఊ .... ఈ మాటు అడగండి ఆ ప్రశ్నేదో' అన్నాడు జగదీష్.

తను కాస్సేపు తటపటాయించి 'అబ్బే - మరేంలేదు....నిన్న మీరు కొన్న ఇలాంటి చీర ఎవరికోసం నాతో చెప్పవచ్చా?' అంది.

'అదా? మా ఫ్రెండ్ చెల్లెలికీ- చీరలసెలక్షన్ తనకి బొత్తిగా తెలి యదు అని నన్ను పంపించాడు. నిజానికి నాకూ తెలియదు. కాని ఆవంకని కాస్సేపు వాడి స్కూటర్ మీద షైరు కొట్టి రావచ్చుని, వాడు ఆఫీసుపని హడావిడిలో ఉంటే నేను వచ్చాను.'

'అదేవిటండీ! ఎవరికేనా చెబితే నమ్మాలా? మీకు నచ్చిన చీర ఆయన చెల్లెలికి ఎలా నచ్చుతుంది! ఏదో చిన్న అబద్ధం ఆడుతున్నా రిందులో.'

'కాదండి - నా మాట నమ్మండి' అంటూ తటాలున తన చెయ్యి లాక్కుని చేతిలో చెయ్యి వేశాడు జగదీష్. వెయ్యి విద్యుత్తులు ప్రవ హించినట్లు తనకి శరీరం అంతా ఒక్కమారుగా గగుర్పొడిచింది అతని స్పర్శతో.

'ఉండండి' అంటూ తన చేతిని

బలవంతంగా విడదీసుకుని 'మీతో పాటు మీ ఫ్రెండ్ కూడా రిజర్వ్ బేంక్‌లోనే పని చేస్తున్నారా? అందితను.

'నాతో పాటా?' అని జగదీష్ విషాదంగా నవ్వి 'నిజం చెప్పమంటారా ?' అన్నాడు.

తను 'లేకపోతే అబద్ధం చెప్తారా?' అంది నవ్వుతూ

'అయితే వినండి. నేను ప్రస్తుతం నిరుద్యోగిని. ఏదో ఒక ఉద్యోగం చూసుకో వచ్చు రమ్మని మా రిజర్వ్ బేంక్ ఫ్రెండ్ రాస్తె రెణ్ణెల్ల క్రితం ఈ బొంబాయి వచ్చాను. చేసిన ప్రయత్నం ఒక్కటీ ఫలించలేదు. ఇంకో పదిహేను రోజులు చూసి తిరిగి మా ఊరు వెళ్ళిపోదాం అనుకున్నాను.

'నిరుద్యోగా?.... అ స్కూటరూ, ఆ రిజర్వ్ బేంక్ ఉద్యోగం ఇవేవీ ఈయనవి కావూ?.... నిజమా?....' తను కట్టుకొన్న ఊహా సౌధాలన్నీ గాలికి ఎగిరిపోతున్నట్లు అనిపించింది. 'మీరేం చదువుకున్నారు?' అని అడిగి, వెంటనే పెళ్ళిచూపుల్లో పెళ్ళికూతుర్ని అడిగినట్లు ఈ ప్రశ్న లేవిటి అనుకొంది తను.

'ఏం అలా అడుగుతున్నారు ఇంటర్వ్యూలోలాగ? కొంపదీసినాకు ఉద్యోగం ఇస్తారేవిటి?' అన్నాడు నవ్వుతూ జగదీష్.

'నిజంగా ఈయనకి ఉద్యోగం లేదా? అందం, తెలివి, సంచితనం, చదువూ అన్నీ ఉన్న వ్యక్తికి ఉద్యోగం ఒక్కటే లేకపోతే ఏం? కాని .... కాని.... అన్నయ్య పరిస్థితిని బట్టి వాడికి బరువుగా ఉండడానికి వీలు లేదు. నిరుద్యోగిని పెళ్ళి చేసుకుంటే బరువు కాక మరేవిటి? తన హృదయాలయంలోని దేవత వెలవెల పోతున్నట్లూ, ఎంతో ఎత్తుగా ఎగిరిన ఊహాల కెరటాలు చప్పగా దిగిపోయి సముద్రంలో కలిసిపోయినట్లూ అనిపించింది.

'నేను నిరుద్యోగిని అనగానే మీ రలా నిరుత్సాహంతో ఉండిపోయారేం ?'

తనేం మాట్లాడలేదు.

'ఒక్కమాట చెప్పండి. ఉద్యోగం చేస్తున్న వాడికి తప్ప వివాహం చేసుకొనే అర్హత నాలాంటి వాడికి ఉండదా ?'

తను ఉలిక్కిపడింది. తన మనస్సుని ఈయన చదివేస్తున్నారా?.... 'అబ్బెబ్బె.... లేదు.... లేదు' అంది.

'అమాటన్నారు చాలు....ఎప్పటికేనా ఉద్యోగం అంటూ వస్తే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాను.'

తన హృదయం ఝల్లుమంది.

తన ఆలోచనలనిండా అయన!

బహుశా ఆ సమయంలో ఆయన భావాలుకూడా తన గురించే అయి వుంటాయి.

అలా ఒకరి ఆలోచనల్లో మరి యొకరూ, ఒకరి కన్నులలో ఇంకొకరూ నిండి, తమ వెనకాలవున్న పట్టణాన్నీ ఎదురుగుండావున్న సముద్రాన్నీ చుట్టూవున్న పరిసరాల్నీ మరచి, కాలగమనాన్నే గమనించకుండా తాదాత్మ్యస్థితిలో ఎంతసేపు ఉండిపోయారో_

ఇద్దరూ తిరిగి బీచ్ లోంచి పట్నంలోకి వస్తున్నప్పుడు, ఎదురుగుండావున్న నగరం అప్పుడే వెలిగిన లైట్ల కాంతిలో అందంగా అలంకరించిన ఓడలా కన్పించింది. ఇద్దరూ ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడడానికికూడా ఓపిక లేకుండా అలసిపోయినట్లు ఫీలయ్యారు.

'ఇంత ఆలశ్యంచేశారు ఎక్కడికి వెళ్ళారు. ఏవిటిద్దరూ అలా వున్నారు?' అని అడిగిన ప్రశ్నకి తనూ జవాబు చెప్పలేదు. జగదీషూ మాట్టాడలేదు.

మర్నాడు సుందరి తనని అడిగింది 'ఏవిటే నిన్నటినుంచీ అలా వున్నావు?' అని_ తను కాస్సేపు తటపటాయించి చెప్పింది' అతనికి ఉద్యోగంలేదు - నిరుద్యోగి' అని.

'మరి రిజర్వుబేంక్ ఏమిటి?'

'అది తన స్నేహితుడు పని చేస్తున్న బేంక్ ట'

'నిరుద్యోగికి ఆ స్కూటర్ ఎందుకు ?'

'అదీ అతనిది కాదుట !'

'మొత్తానికి పెద్ద మోసగాడిలా ఉన్నాడే_ ఇలాంటివాళ్ళు బొంబాయిలో ఆడపిల్లల్ని వలలో వేసుకొని మోసంచేసి వదిలేస్తూ వుంటారు'

'ఆయన అలాంటివారులా లేరే!'

'ఏవిటి అప్పుడే ప్రేమిస్తున్నావేమిటి? ఇలాంటివి జీవితంలో ఎన్నో జరుగుతాయి. సరదాగా తీసుకొని మరిచిపోవాలి కాని మరీ మనస్సుకి పట్టించుకోకూడదు.'

'ఉద్యోగం వచ్చాక నన్ను వెతుక్కుంటూ వస్తానన్నారు.'

'నువ్వు నమ్మావా?'

'నన్ను అన్యాయం చెయ్యనన్నారే?'

'నువ్వు అతనికి దొరక్కపోతే నీకు అన్యాయం ఏమిటి - అతనికే అన్యాయం నీలాంటి బంగారపు బొమ్మతప్పిపోయినందుకు, సరేకాని, ఈకబుర్లు తీసిపారేసి ఇవాళ తాజ్లో పేడో తేల్చేసుకో - నడు అక్కడికి వెళదాం'—

క్రితం రోజు కలుసుకొన్న చోటికి వెళ్ళి ఎన్నిగంటలు నిరీక్షించినా జగదీష్ రాలేదు. నిలబడి నిలబడి కాళ్ళు పీకేశాయి; చూసి చూసి కళ్ళు నెప్పిపెట్టాయి. ఏడు గంటలకి బాధతో నీరసంగా తిరిగి ఇంటిముఖం పడుతూంటే 'చూశావా?.... పెద్ద

ప్రేమికుడు! ప్రేమ! అని మురిసి పోయావు' అంది సుందరి ఎత్తి పొడుస్తూ.

తనకి ఏడుపు వచ్చింది.

ఆ తర్వాత వారం పది రోజులకి అన్నయ్యదగ్గర్నుంచి ఉత్తరం రావడం, తను బొంబాయి వదిలి వచ్చెయ్యడం జరిగిపోయింది. తననిచూసుకోవడానికి ఎవరో పెళ్ళివారు వచ్చారు. వాళ్లకి తను నచ్చింది కూడా. ఎక్కువ కట్నం అడక్కపోవడంవల్ల అన్నయ్యకి కూడా వాళ్ళు నచ్చారు. ఇంక నాకు పెళ్ళికొడుకు నచ్చాడా నచ్చలేదా అనే సంగతే పట్టించుకోకుండా, మొగ పెళ్ళివారి ఇష్టప్రకారం తిరుపతి కొండ మీద పెళ్ళిచెయ్యడానికి అన్ని ఏర్పాట్లు జరిగి పోసాగాయి.

ఇంక తను కాదంటే మాత్రం ఏం అయినట్లు?

కాదనిమాత్రం ఎలా అంటుంది?

జగదీష్ తన కేమైనా ఆశ మిగిల్తే కదా?

అతనితో కాకపోయాక ఇంక ఎవరితో అయితేనేం తన పెళ్ళి?

అందుకే అంగీకరించింది. 'మీ ఇష్టమే నాఇష్టం'- అని అన్నయ్యతోటి వదినతోటీ చెప్పింది. అలా చెప్పిన నాలుగు రోజులకి కాబోలు సుందరి దగ్గర్నుంచి ఉత్తరంవచ్చిది. ఆ తర్వాత ఈమధ్యన అనుకోకుండా జగదీష్ కనిపించాడనీ, తను నాలుగు చివాట్లూ వేస్తే పడి, పొరపాటయిపోయిందంటూ విచారించాడనీ, ఆ రోజున వస్తానని రాకపోడానికి కారణం ఆ రోజునే తానేదో ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళవలసి వచ్చిందని చెప్పాడనీ, మరైతే ఫలానా వ్యక్తితో ఫలానా రోజున తిరుపతికొండమీద సరోజని పెళ్ళి జరుగుతోందని తానుచెప్తే, తల వంచుకొని మౌనంగా విని ఊరుకున్నాడేకాని ఏం మాట్లాడలేదనీ, నేటి ప్రేమకలాపాలు ఇలా ఉంటాయనీ, అందువల్ల అన్నయ్య కుదిర్చిన సంబంధంతో తృప్తిపడి, చక్కగా ఆ కుర్రవాడిని పెళ్ళిచేసుకుని సుఖపడమనీ ఏవేవో రాసింది.

ఆ ఉత్తరం చదివినప్పుడు తన కన్నీటిచుక్కలు పడి అందులో అక్షరాలు అలుముకుపోయాయి. చివరికి ఒక నిరాశ చేసుకుని తన నుదటను ఇంతే రాసివుందని సమాధానపడి ఈ పెళ్ళికి సిద్ధం అయింది.

ఇలా గౌరీపూజ చేస్తున్నంత సేపూ గత స్మృతుల్ని తలుచుకుంటూ కళ్ల నీళ్ళు పెట్టుకుంటూనేవుంది సరోజని. ఇంతలో పందిట్లోంచి ఏవో పెద్ద పెద్ద కేకలు వినిపించసాగాయి. చుట్టాలూ బంధువులూ హడావిడిగా

అటు పరిగెట్టారు. కొందరు వెనక్కి తిరిగివస్తూ 'అయ్యో' అని నోళ్ళు నొక్కుకుంటున్నారు.

పందిట్లోంచి అన్నయ్య కంఠం ప్రాధేయపూర్వకంగా వినిపిస్తోంది. ఏదో ప్రమాదం జరిగినట్లు అందరూ పడుతూన్న ఆ కంగారుని చూసి ఒకళ్ళిద్దర్ని పిలిచి 'ఏమైంది ?' అని అడిగింది గౌరీపూజ అప్పుడే పూర్తి చేసిన సరోజని. ఎవరూ సమాధానం చెప్పకపోగా ఆమెకేసి అదోలా చూసి వెళ్ళిపోయారు. జరగకూడని దేదో జరిగిపోయినట్టు విషాదంగా మారిపోయి, నవానాడులు కుంగి పోయిన మనిషిలా నీరసంగా నడిచి వెళ్తూన్న వదినని చూచి 'ఏమైంది వదినా? ఏమిటిలా అంతా తొందర తొక్కిడిగా తిరుగుతున్నారు. ఎవరూ ఏం చెప్పరేం ?' అంది సరోజని.

సరోజని కేసి సీరియస్‌గా చూసి అసహ్యంగా ముఖంపెట్టి 'నీకు తెలియదూ?' అదిగో మీ అన్నయ్య వస్తున్నారు. ఏవండీ - మీ చెల్లెలు ఏదో అడుగుతోంది వినండి అంది సరోజని వదినగారు, సుశీల.

మాధవరావు నిప్పులు కక్కుకుంటూ వచ్చాడు. అతని వెనకాలే మగపెళ్ళివారి తాలూకు, పెళ్ళి కొడుకు మేనమామ ఇంకో ఇద్దరు పెద్దమనుష్యులూ వచ్చారు. వస్తూనే మాధవరావు సరోజని రెక్కపట్టు లేవదీసి, పెళ్ళికొడుకు తరఫువారికి ఆమెని చూపిస్తూ 'చూడండి ఇదీ మా సరోజని. మీరంటున్నది దీని గురించేనా?' అన్నాడు కోపాన్నీ బాధనీ గొంతులో ధ్వనిస్తూ.

'కాకపోతే ఎందుకు చెప్తాడు మావాడు ! కాదని మీ అమ్మాయిని చెప్పమనండి అసలు?' అన్నాడు అందులో ఒకాయన పైమీదకండువా సర్దుకుంటూ.

'చూడమ్మా, నువ్వు బొంబాయిలో ఒక బట్టలదుకాణంలో 'షో గర్ల్' గా పనిచేశావనీ అలా యందరి ఎదుటా నిలబడి బజారుపిల్లలా వ్యవహరించిన అమ్మాయిని మాకు అక్కర్లేదని ఇప్పుడు వీళ్ళు అంటున్నారు. నువ్వు అలాంటి పనిచెయ్యలేదని చెప్పమ్మా' అన్నాడు మాధవరావు. సరోజని గుండె ఆగింది. రక్తం స్తంభించి నవనాడులూ క్రుంగి పోయాయి. 'ఎలా తెలిసింది వీళ్ళకి?' సరోజని ముఖం వెలవెల పోయింది.

'ఇంకేం ? నడవండర్రా ఎరక్క పోయి ఈ ముదనష్టపు సంబంధాన్ని ఎంచుకున్నాం' అంటూ పెళ్ళికొడుకు మేనమామ నేలమీద తుపుక్కున ఉమ్మివేసి తనవాళ్ళతో వెనక్కి తిరగబోయాడు.

'ఆగండి!' మాధవరావు గర్జించాడు. 'ఇలా అన్యాయంగా దాని మీద అపవాదు వేసి వెళ్లిపోడానికి వీలులేదు. ఎవరు చూశారు అది షోగర్లుగా పని చెయ్యడం?'

'ఎవరా?.... నేను!— జనాన్ని చీల్చుకుని ముందుకు వచ్చి నిలబడ్డ జగదీష్‌ని చూడగానే సరోజని నోట మాటలేక దిగ్భ్రాంతురాలైపోయింది.

కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుని' ఏం బాబూ! పచ్చగా పెళ్ళి జరుగుతూంటే చూసి సంతోషించడం అట్టే పోయి కావాలని చెడగొడతావా? పీటలమీద పెళ్ళి ఇలా తప్పిపోతే దానికి జన్మలో ఇంక పెళ్ళి అవుతుందా'? అన్నాడు మాధవరావు.

'ఎందు కవదు?' అన్నాడు జగదీష్ వెనక్కి తిరిగి, అప్పటికే సామానులు సర్దుకుని వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్న మగపెళ్ళివారిని చూస్తూ.

'ఎలా అవుతుంది? ఎవరు చేసుకుంటారు?' గర్జించాడు మాధవరావు.

'ఎవరా? మీకు అభ్యంతరం లేకపోతే నేను'

'ఏవిటి?' మాధవరావూ సుశీలా ఒక్కమారు అరిచారు.

'అవునండి నేను చేసుకుంటాను. అన్న మాటప్రకారం ఉద్యోగం కాగానే ఆమెని వెతుక్కుంటూ వచ్చా. తీరా చూస్తే ఆమె మా చుట్టాలబ్బాయికే భార్య కాబోతోంది. అందువల్ల స్వార్థంతో ఈ పెళ్లి తప్పించాను.'

సరోజని హృదయంలో వెయ్యి మంగళతూర్యారావాలు మ్రోగాయి సుశీలా మాధవరావుల ముఖాలమీద మళ్లీ నవ్వులు విరిశాయి. తనని దర్శించవచ్చిన నూతన దంపతుల్ని చూసి తిరుమలేశుడూ నవ్వాడు; అసలాయన ఎప్పుడూ నవ్వుతూనే ఉన్నాడు అనుకుంది సరోజని.

